సాక్షి రంగారెడ్డి

గురువారం, 20, మార్చి, 2025




వరద కాలువ మాయం

రియల్టర్లు హైడ్రాను సైతం లెక్క చేయకుండా యథేచ్ఛగా వరద కాల్వల కబ్జాకు పాల్పడుతున్నారు. 12లో



రథోత్సవం

పడకల్ గ్రామంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 12లో



ఇఫ్తార్	సహర్
గురువారం	శుక్రవారం
సా. 6.33 గం.	ఉ. 4.58 గం.

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ఇంటి వద్దకే భద్రాద్రి రామయ్య తలంబ్రాలు

షాద్‌నగర్ డీఎం ఉష

షాద్‌నగర్‌రూరల్: శ్రీరామ నవమిని సందర్భంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలను కావాల్సిన భక్తులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని డీఎం ఉష బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే చేర్చేందుకు ఆర్టీసీ నిర్ణయించిందని.. తలంబ్రాలు కావాల్సిన భక్తులు రూ.151 చెల్లించి బస్టాండ్ ఆవరణలోని కార్గో కేంద్రంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆశలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ప్రతీ నెల రూ.18 వేల వేతనం ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్
- కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రతీ నెల రూ.18 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని.. బడ్జెట్ సమావేశాల్లో తగిన కేటాయింపులు చేయాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కిషన్, కవిత మాట్లాడుతూ.. ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశలకు ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, జూలై 30న, డిసెంబర్ 10, ఫిబ్రవరి 9న ఆరోగ్య కమిషనర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. 2021 జూలై నుంచి డిసెంబర్ 6 వరకు ఆరు నెలల పీఆర్సీ, ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించి.. పారితోషికం లేని పనులు చేయించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాయిబాబా, రుద్రకుమార్, జిల్లా నాయకులు బుట్టి బాల్‌రాజ్, కృష్ణ, పెంటయ్య, ఆశ యూనియన్ జిల్లా నాయకులు రాధిక, కవిత, అనిత, జహంగీర్, నీలమ్మ, నిర్మల, కవిత, అనిత, చంద్రకళ, సుశీల, జయసుధ, సరస్వతి పాల్గొన్నారు.

త్వరలో పెండింగ్ బిల్లులు విడుదల

- సమస్యల పరిష్కారానికి చర్యలు
- సీఐటీయూ నాయకులతో జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు



సీఐటీయూ, మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడుతున్న డీఈఓ సుశీంధర్‌రావు

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వీలైనంత త్వరగా వచ్చేలా చూస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంధర్‌రావు హామీ ఇచ్చారు. బుధవారం సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలపై కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇవ్వడంతో ఆయన వెంటనే డీఈఓతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు సుశీంధర్‌రావు వారితో సమావేశమయ్యారు. మధ్యాహ్న భోజనం పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న కార్మికుల సమస్యలను డీఈఓకు వివరించారు. ఎనిమిది నెలల బిల్లులు, మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కొన్ని మండలాల్లో ఉదయం టిఫిన్ బిల్లులు అందలేదని.. మరికొన్ని పాఠశాలల్లో మెనూ జావాలేనప్పటికీ హెచ్ఎంలు బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. పాఠశాలలు ప్రారంభమైన నాటి నుంచి బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నప్పుడు హెచ్ఎంలకు ముందుగా స్నాక్స్ బిల్లులు అందినా వేరే వారితో స్నాక్స్ పెట్టిస్తున్నారని చెప్పారు. పాఠశాలలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని కోరారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళా కన్వీనర్ కవిత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, కిషన్, సాయిబాబు, జిల్లా నాయకులు కృష్ణ, పెంటయ్య, శేఖర్, బాలరాజు, అలివేలు, గణేశ్, సరిత, శిరీష, లావణ్య, పద్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఫ్యూచర్‌లోనే ఏఐ

56 గ్రామాలతో నయానగరం

- ఏఐ, ఐటీ, ఫార్మా, స్పోర్ట్స్ హబ్‌గా ఫోర్త్ సిటీ
- స్కిల్ వర్సిటీ రాకతో ఏటా 30 వేల మందికి ఉపాధి
- మౌలిక సదుపాయాల కల్పనకు రూ.వంద కోట్లు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీలోనే ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఈ సిటీని ప్రముఖంగా ప్రస్తావించడం గమనార్హం. ఐటీ, ఫార్మా, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. శంకర్‌పల్లిలో 250 మెగావాట్ల విద్యుత్ బ్యాటరీ స్టోరేజీ యూనిట్ సహా కోహెడలో రూ.47 కోట్లతో చేపల మార్కెట్‌ను నిర్మించనున్నట్లు పేర్కొంది. రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయనున్నట్లు తెలిపింది. బడ్జెట్‌లో మాత్రం ఇందుకు ఎలాంటి నిధులు కేటాయించక పోవడం రైతులను నిరాశ పర్చింది. జిల్లాలోని ఉస్మాన్‌సాగర్, హియత్‌సాగర్‌లను కాళేశ్వరం నీటితో అనుసంధానం చేసి నగరవాసుల దాహార్తిని తీర్చనున్నట్లు స్పష్టం చేసింది.

ఫ్యూచర్ సిటీకి అధిక ప్రాధాన్యత

దేశానికే తలమానికంగా నెట్‌జీరో ఫ్యూచర్ సిటీని రూపొందిస్తోంది. ప్రపంచ నగరాలతో పోటీపడేలా కాలుష్య రహితంగా, అత్యాధునిక హంగులతో దీన్ని తీర్చిదిద్దనుంది. శ్రీశైలం–నాగార్జునసాగర్ రహదారుల మధ్య 56 గ్రామాల్లో, 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మెగా అర్బన్ ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ)ను ఏర్పాటు చేసింది. ఈ సిటీలో మల్టీ మోడల్ కనెక్టివిటీ, ఎలక్ట్రికల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు, గ్రీన్ బిల్డింగ్స్ వంటి అత్యాధునిక సౌకర్యాలు సమకూరబోతున్నాయి. ఏఐ సిటీ, ఫార్మా హబ్, స్పోర్ట్స్ సిటీ, క్లీన్ ఎనర్జీ ఇన్నోవేషన్ జోన్లు ఈ నగరంలో భాగంగా ఉండనున్నాయి. పనుల పర్యవేక్షణ కోసం స్పీడ్(స్మార్ట్ ప్రొయాక్టీవ్, ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) సిస్టం ఏర్పాటు చేసింది. ఫ్యూచర్‌సిటీలో మౌలిక వసతుల కల్పనకు రూ.వంద కోట్లు కేటాయించింది.

శంకర్‌పల్లిలో ఎనర్జీ స్టోరేజీ కేంద్రం

పునరుత్పాదక విద్యుత్ ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ–2025లో భాగంగా 2030 నాటికి 20వేల మెగావాట్లు, 2035 నాటికి 40 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ని అదనంగా ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. గ్రిడ్ స్థిరత్వాన్ని మెరుగుపర్చేందుకు శంకర్‌పల్లి వద్ద 250 మెగావాట్ల(500 ఎంహెచ్‌జెడ్) బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు

రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఔషధాల తయారీ కంపెనీలకు, బయోటెక్, లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించి, క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం తోడ్పడుతుంది. యాంటి బయాటిక్స్, సింథటిక్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, న్యూట్రాస్యూటికల్స్, హెర్బల్ ఔషధ, కాస్మోటిక్స్ ఉత్పత్తులన్నింటికీ ఈ ఫార్మాసిటీలో ప్రాధాన్యత కల్పించనున్నట్లు పేర్కొంది.

200 ఎకరాల్లో ఏఐ సిటీ

ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీని నెలకొల్పనున్నట్లు ప్రభుత్వం తన వార్షిక బడ్జెట్‌లో ప్రకటించింది. పారిశ్రామిక దిగ్గజ కంపెనీలన్నీ ఇక్కడ కొలువుదీరనున్నాయి. ఏఐ విశ్వవిద్యాలయం సహా డేటా సెంటర్లు, కంప్యూటింగ్ సౌకర్యాలు, పౌరులకు అవగాహన కల్పించే కేంద్రాలను ఇక్కడ స్థాపించనుంది. గూగుల్ కంపెనీ ఇక్కడ ఏఐ ఆధారిత యాక్సిలరేటర్ సెంటర్‌ను నెలకొల్పనుంది.

భవిష్యత్‌లో అత్యాధునిక కోర్సులు

ముచ్చర్ల కేంద్రంగా 150 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ ద్వారా ఏటా 30 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐటీఈ)తో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇప్పిస్తోంది. వివిధ పరిశ్రమల భాగస్వామ్యంతో వర్సిటీలో అందించే కోర్సులు ఇటు యువతకు, అటు పరిశ్రమలకు ఎంతో ఉపయోగపడనున్నాయి. ప్రస్తుతం ఐదు కోర్సులు ప్రారంభించినట్లు పేర్కొంది. భవిష్యత్‌లో యానిమేషన్, టూరిజం, హాస్పిటాలిటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, నిర్మాణ రంగం, రిటైల్ రంగం, మీడియా, సినిమా రంగం, నౌక, విమానాల నిర్వహణ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి అత్యాధునిక కోర్సులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటింది.

కంసాన్‌పల్లిలో ఫ్రొజెన్ సెమన్ బుల్ స్టేషన్

షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లిలో మేలు జాతి పాడిపశువుల వృద్ధి కోసం కొత్త ఫ్రొజెన్ సెమన్ బుల్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రూ.21.06 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. ఏటా 10 లక్షల ఫ్రొజెన్ సెమన్ డోసుల ఉత్పత్తి సామర్థ్యం ఏర్పడుతుంది.

స్పోర్ట్స్ హబ్‌లో 12 అకాడమీలు

ప్రభుత్వం సమగ్ర క్రీడా విధానాన్ని ప్రవేశపెట్టి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నిర్మించే ఈ ఫ్యూచర్‌సిటీలో స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. 12 క్రీడల అకాడమీలను ఇందులో భాగం చేయనుంది. స్పోర్ట్స్ సైన్స్ సెంటర్ సహా స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్‌లు అందుబాటులోకి రానున్నాయి.

మామిడిపల్లిలో పశువైద్య టీకాల కేంద్రం

హైదరాబాద్ శాంతినగర్‌లో ఉన్న పశువైద్య టీకా ఉత్పత్తి కేంద్రాన్ని జిల్లాలోని మామిడిపల్లికి తరలించి, రూ.300 కోట్లతో సేవలను మరింత విస్తరింపజేయనున్నట్లు ప్రకటించింది. కొత్త వ్యాక్సిన్ల ఆవిష్కరణ, పరిశోధనలకు కోసం అత్యాధునిక యంత్రాలు సమకూర్చేందుకు అధనంగా మరో రూ.వంద కోట్లు కేటాయించింది. ఈ టీకాల కేంద్రంలో బ్యాక్టీరియల్, వైరల్ వ్యాక్సిన్ ప్రొడక్షన్ ప్లాంట్లు, క్వాలిటీ కంట్రోల్, యానిమల్ టెస్టింగ్ ల్యాబ్ సహా యానిమల్ బ్రీడింగ్ సెంటర్ వంటివాటితో పాటు స్టాఫ్ క్వార్టర్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించింది.

కోహెడలో చేపల మార్కెట్

చేపల ఎగుమతిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జిల్లాలోని కోహెడలో ఎక్స్‌పోర్ట్ ఓరియెంటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించింది. బడ్జెట్‌లో ఇందుకు రూ.47 కోట్లు కేటాయించింది.

తలసిరి



రూ.10.55 లక్షల ఆదాయంతో మనమే టాప్

- అత్యల్పంగా వికారాబాద్
- జీడీపీ తొలి మూడు స్థానాల్లో రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి

2023-24 సంవత్సర తలసరి ఆదాయం	
రంగారెడ్డి	రూ.10,55,913
హైదరాబాద్	రూ.5,54,105
సంగారెడ్డి	రూ.3,45,478
మేడ్చల్–మల్కాజ్‌గిరి	రూ.3,43,130
వికారాబాద్	రూ.1,98,40

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, వనరుల లభ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధితో తలసరి ఆదాయంలో జిల్లా తొలి స్థానంలో నిలిచింది. రాష్ట్ర తలసరి ఆదాయం సగటున రూ.3,46,457 ఉండగా.. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల తలసరి ఆదాయం ఎక్కువగా ఉంది. సామాజిక ఆర్థిక సర్వే–2025 ప్రకారం 2023-24 సంవత్సరానికి అత్యధిక తలసరి ఆదాయం రంగారెడ్డిలో ఉండగా అత్యల్పంగా వికారాబాద్ నిలిచింది.

గ్రేటర్ చుట్టూ సంపద

గ్రేటర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సంపద, ఆర్థిక అవకాశాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ఆయా జిల్లాలు బలమైన పారిశ్రామిక, ఐటీ, సేవా రంగాల వృద్ధి నుంచి ప్రయోజనం పొందుతాయి. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉండడంతో అధిక ఆదాయ స్థాయిలను కలిగి ఉన్నాయి. తలసరి ఆదాయం (పీసీఐ) అనేది ఒక జిల్లాలోని వ్యక్తుల సగటు ఆదాయం. ఇది జిల్లా ఆర్థిక ప్రగతిని సూచిస్తుంది. అభివృద్ధి కొన్ని పట్టణ జిల్లాల వైపు ఎక్కువగా కేంద్రీకృతమై ఉంది. ఆర్థిక ప్రయోజనాలు సమానం పంపిణీ చేయడంలో వైఫల్యం వల్లే కొన్ని జిల్లాల్లో తలసరి ఆదాయం తక్కువగా ఉంది.

జీడీపీలోనూ మనమే..

స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి (జీడీపీ) వ్యవసాయం, తయారీ, సేవలు, నిర్మాణం ఇతర పరిశ్రమలతో సహా జిల్లాలో ఉత్పత్తి అయ్యే వస్తువులు, సేవల విలువలను సూచిస్తుంది. ప్రస్తుత ధరల ప్రకారం జీడీడీపీలో గ్రేటర్ హైదరాబాద్ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. రాష్ట్రంలో అత్యధికం జీడీడీపీ రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. రంగారెడ్డిలో జీడీడీపీ రూ.3,17,898 కోట్లుగా ఉండగా.. హైదరాబాద్‌లో రూ.2,57,949 కోట్లు, మేడ్చల్–మల్కాజ్‌గిరిలో రూ.1,04,710 కోట్లుగా ఉంది. ఆర్థిక కార్యకలాపాలు హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఎక్కువగా కేంద్రీకృతమై ఉండటమే ఈ వృద్ధి కొనసాగింపునకు ప్రధాన కారణం.

ఉత్తర, దక్షిణ భాగాలుగా 'ట్రిపుల్ ఆర్'

హైదరాబాద్‌లో రద్దీని తగ్గించడంతో పాటు ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపరిచేందుకు రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్)ను నిర్మించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ట్రిపుల్ ఆర్ పరిసర ప్రాంతాలలో ఆర్థికంగా వృద్ధి చెందుతాయి. ఇప్పటికే హైదరాబాద్‌కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి 50–60 కి.మీ. దూరంలో ట్రిపుల్ ఆర్ రానుంది. మొత్తం 361.52 కిలో మీటర్ల పొడవు ఉండే ట్రిపుల్ ఆర్‌ను ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా అభివృద్ధి చేయనున్నారు.

ఉత్తర భాగం: 161.52 కిలోమీటర్లు
మార్గం: సంగారెడ్డి (ఎన్‌హెచ్–161)–నర్సాపూర్–తూప్రాన్– గజ్వేల్– జగదేవ్‌పూర్– భువనగిరి–చౌటుప్పల్
దక్షిణ భాగం: 200 కిలో మీటర్లు
మార్గం: చౌటుప్పల్ (ఎన్‌హెచ్–65)–షాద్‌నగర్–సంగారెడ్డి

నిలిచిన 'ధరణి'

రిజిస్ట్రేషన్లకు మూడురోజులుగా రైతుల పడిగాపులు

కొందుర్గు: మూడు రోజులుగా ధరణి సేవలు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఆపదలో భూములు అమ్ముకుంటే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు స్లాట్ బుక్ చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిమూడు రోజులుగా నిరాశగా వెనుదిరుగుతున్నామని చెప్పారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో దాదాపు 100 స్లాట్లు బుక్ చేసుకున్నప్పటికీ ధరణి సైట్ నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్లు పూర్తికావడం లేదు. ధరణి సైట్ రాత్రివేళల్లో వస్తుందని, ఆ సమయంలో చలాన్ డబ్బులు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకొని, పగలు కార్యాలయ సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వస్తే ధరణి సేవలు మొరాయిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కొందుర్గు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వేచి ఉన్న రైతులు

'ఆహార భద్రత'కు భంగం కలిగిస్తే చర్యలు

రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కద్తాల్: ఆహార భద్రత హక్కుకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని స్టేట్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఓ రేషన్ దుకాణంతో పాటు, అంగన్వాడీ కేంద్రం, బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, కేజీబీవీ, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలను ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, గోవర్ధన్ రెడ్డి, జ్యోతి, అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలోని రేషన్‌షాపును తనిఖీలు చేపట్టారు. అంత్యోదయ కార్డు లబ్ధిదారులకు పంచదార అందించడం లేదని తెలుసుకున్నారు. దీనిపై 30 రోజుల్లో కమిషన్‌కు నివేదిక అందించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రేషన్ షాపుల వద్ద ఫిర్యాదు బాక్స్, స్టాక్ వివరాలు, సంబంధిత పౌర సరఫరా శాఖ అధికారుల ఫోన్ నంబర్ల వివరాలు ఖచ్చితంగా పెట్టాలని కమిషన్ బృందం ఆదేశించింది.

గుడ్లు పంపిణీ చేసిన ఏజెన్సీకి నోటీసులు

అంగన్వాడీ కేంద్రం–2, 4 కేంద్రాలను సందర్శించి చిన్నారులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం నిల్వలను, రికార్డులను పరిశీలించారు. గుడ్డు పరిమాణం తక్కువగా ఉందని.. గుడ్లు పంపిణీ చేసిన ఏజెన్సీకి నోటీసులు ఇవ్వాలని డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్(డీడబ్ల్యూఓ)ను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే వారి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, కేజీబీవీ, బాలుర ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలను, ఫుడ్ కమిషన్ సభ్యులు సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని సమస్యలను విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ పాఠశాల బాలికల్లో రక్తహీనత ఉందని, దానిని అధిగమించేందుకు పోషకాలు అధికంగా ఉన్న ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో వెంటనే ఏఎన్ఎంను నియమించాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీ పాఠశాలలో నీటి సమస్య ఉందని, పాఠశాల ఎస్ఓ అనిత కమిషన్ సభ్యుల దృష్టికి తెచ్చారు. అనంతరం ఫుడ్ కమిషన్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలన్నారు. నాణ్యత లేని సరుకులను వెనక్కి పంపాలని ఉపాధ్యాయులకు సూచించారు. జాతీయ ఆహార భద్రత చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, డీటీడీఓ రామేశ్వరి, ఏటీడీఓ వెంకటయ్య, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ డీసీఎస్ఓ శ్రీనివాస్, మేనేజర్ గోపీకృష్ణ, డీడబ్ల్యూ సంధ్య, సీడీపీఓ శాంతిరేఖ, డీఆర్‌డీఏ ఏపీడీలు, నరేందర్ రెడ్డి చరణ్‌గౌతమ్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాత, ఎంఈఓ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఏసీఎం రాజేశ్వరి, డీటీలు రవీందర్‌నాయక్, భానుప్రకాశ్, కార్యదర్శి అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు

షాద్‌నగర్‌కు 'లక్ష్మీదేవి' కటాక్షం

- రిజర్వాయర్ నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు
- రూ.266.65 కోట్ల నిధులు కేటాయింపు
- బడ్జెట్‌లో భట్టి ప్రకటనతో రైతన్నల్లో ఆనందం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషికి ప్రశంసలు

షాద్‌నగర్: సాగు సస్యశ్యామలానికి గంగమ్మ తల్లి కావాలి.. గంగమ్మ తల్లి రాకకు లక్ష్మీదేవి కటాక్షం ఉండాలి. షాద్‌నగర్ రైతులకు లక్ష్మీ కళను ఇచ్చేది లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్. ఈ రిజర్వాయర్ కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతుల కల ఎట్టకేలకు సాకారం కాబోతుంది. గతంలో పాదయాత్రలో భాగంగా ఈ రిజర్వాయర్ స్థలాన్ని స్వయంగా పరిశీలించి సాగు నీటి అవసరాలను గుర్తించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రిజర్వాయర్ కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

ఇదీ ఆరంభం

నియోజకవర్గ రైతులకు నీటి వనరులు లేక కేవలం చెరువులు, బోర్ల ఆధారంగానే సాగు చేపట్టారు. చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని, తాము అధికారంలో వస్తే తొలి ప్రాధాన్యత ఇస్తామని మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలో ప్రకటించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో అంతర్భాగమైన ఈ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు నల్గొండ జిల్లాకు విస్తరించనున్నట్లు అప్పట్లో ప్రకటించారు. రిజర్వాయర్ నిర్మాణానికి చేపట్టిన మూడు సర్వేలు కార్యరూపం దాల్చలేదు.

మొత్తానికి మోక్షం

వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేగా గెలుపొందాక రిజర్వాయర్ నిర్మాణం విషయమై పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలోనూ ప్రస్తావించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం రూ.266.65కోట్లతో పాలనాపరమైన అనుమతి ఇచ్చినట్లు ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ నేతలతో పాటుగా, నియోజకవర్గ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి అయితే సాగునీటి కష్టాలు తీరుతాయని రైతులు తమ ఆనందాన్ని వెల్లిబుచ్చుతున్నారు. రిజర్వాయర్ కోసం ఎంతో కృషి చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు స్థానిక నేతలు అభినందనలు తెలిపారు.



బడ్జెట్ వివరాల ఫైల్‌ను సీఎంకు అందజేస్తున్న డిప్యూటీ సీఎం

ఆందోళనలకు అందరి మద్దతు

గత ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ విషయంలో ఆశించిన స్థాయిలో ముందడుగు వేయ లేదు. దీంతో వివిధ పార్టీలు రిజర్వాయర్ నిర్మించాల్సిందేనని ఆందోళనలు చేపట్టారు. ప్రస్తుత ఎమ్మె ల్యే వీర్లపల్లి శంకర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం పోరాడారు. 2018 ఎన్నికల్లో ఇక్కడ ప్రచారానికి వచ్చిన కేసీఆర్ రెండవ సారి అధికారంలోకి వస్తే కుర్చీ వేసుకొని ఈ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కానీ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు. రిజర్వాయర్ నిర్మించే స్థలాన్ని గతంలో ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాదయాత్రలో భాగంగా సందర్శించగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్, వైఎస్ షర్మిల, కోదండరాం, గద్దర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి ఆందోళనలకు మద్దతిచ్చారు.

నిధుల కేటాయింపు హర్షణీయం



లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం హరణీయం. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయితే తాగు, సాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– హన్మంత్‌రెడ్డి, రైతు, ఉమ్మెంత్యాల

భూగర్భ జలాలు పెరుగుతాయి



బోర్లు, వర్షం పై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నాం. బోర్ల ఒట్టిపోతే పంటలు ఎండిపోతున్నాయి. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయితే భూగర్భ జలాలు పెరిగి పంటలు బాగా పండుతాయి.

– సత్తయ్య, రైతు, జిల్లేడు

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం



గత పాలకులు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో పాటుగా పాలనాపరమైన అనుమతులను జారీ చేసింది. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో షాద్‌నగర్ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

యువ ఇంజనీర్ దుర్మరణం

- గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలు
- విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఘటన


హర్షవర్ధన్‌రెడ్డి (ఫైల్)

శంకర్‌పల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న మృతిచెందాడు. శంకర్‌పల్లి పట్టణ శివారులో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిల్లిగుండ్లకు చెందిన గోవర్ధన్‌రెడ్డి, సుధ దంపతులకు హర్షవర్ధన్‌రెడ్డి(30), ధ్రువతేజరెడ్డి సంతానం. శంకర్‌పల్లి శివారులో నిర్మిస్తున్న సుభిషి కన్‌స్ట్రక్షన్స్‌లో హర్షవర్ధన్‌రెడ్డి సైట్ ఇంజనీర్‌గా, ధ్రువతేజరెడ్డి సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విధులు ముగించుకున్న హర్ష తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి దాటిన తర్వాత.. వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అదుపు తప్పిన బైక్ వేగంగా వెళ్లి డివైడర్‌ను తాకింది. దీంతో హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన తోటి ఉద్యోగులు అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వరద కాలువ మాయం

కాసులు దండుకోవడమే ధ్యేయంగా ఎంచుకున్న అక్రమార్కులు జల వనరులను సైతం వదలడం లేదు. దీన్ని కట్టడి చేయాల్సిన అధికార యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మిన్నకుంటున్నారు. ఇదీ మొయినాబాద్ మున్సిపాలిటీలో నెలకొన్న పరిస్థితి.

- చదును చేసి వెంచర్‌లో కలుపుకొన్న రియల్టర్లు
- సురంగల్ పెద్ద చెరువుకు వచ్చే నీటికి అడ్డుకట్ట
- అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


మూడు రెవెన్యూ గ్రామాల పొలిమేరలో పూడ్చిన వరద కాలువ

మొయినాబాద్: చెరువులు, కుంటలు, నాలాలను పరిరక్షించేందుకు ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చింది. కానీ కొంతమంది రియల్టర్లు వాటిని లెక్క చేయకుండా యథేచ్ఛగా వరద కాలువ కబ్జాకు పాల్పడుతున్నారు. తాము చేసే అక్రమ వెంచర్లకు ఏది అడ్డు వచ్చినా దాన్ని నామ రూపాల్లేకుండా చేసేందుకు వెనుకాడడం లేదు. తాజాగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ పెద్ద చెరువులోకి వరద నీరు తీసుకొచ్చే కాలువను మాయం చేశారు. మూడు గ్రామాల రెవెన్యూ పొలిమేరలో ఉన్న వరద కాలువను జేసీబీలతో పూర్తిగా పూడ్చేసి చదును చేశారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో పరిశీలించిన అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

వరద నీరొస్తే ఎలా?

మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సురంగల్ పెద్ద చెరువులోకి కనకమామిడి, నజీబ్‌నగర్ రెవెన్యూల పొలిమేర నుంచి వరద కాలువ ఉంది. అయితే ఇటీవల కొందరు రియల్ వ్యాపారులు, సురంగల్, కనకమామిడి రెవెన్యూల పరిధిలో కాలువకు ఆనుకుని ఉన్న భూమిని కొనుగోలు చేశారు. అందులో అక్రమ వెంచర్ చేయడానికి జేసీబీలతో చదును చేశారు. మూడు రెవెన్యూ గ్రామాల పొలిమేరలో ఉన్న వరద కాలువను వదలకుండా పూర్తిగా పూడ్చేశారు. కాలువను సైతం చదును చేసి తమ భూమిలోనే కలిపేసుకున్నారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు వరద నీరు ఎలా వెళుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పది రోజుల క్రితమే ఫిర్యాదు

మూడు గ్రామాల పొలిమేర నుంచి ఉన్న వరద కాలువను రియల్టర్లు పూడ్చివేసిన విషయంపై స్థానిక రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు పది రోజుల క్రితమే ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు అధికారులు వెళ్లి పరిశీలించారు. కాలువ పూడ్చినట్లు గుర్తించారు. కానీ ఇప్పటివరకు కాలువ పూడ్చిన రియల్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి ప్రధాన కారణం సదరు స్థిరాస్తి వ్యాపారులకు రాజకీయ అండదండలు ఉండడమేనని ప్రచారం జోరుగా సాగుతోంది. పూడ్చివేసిన వరద కాలువను పునరుద్ధరించకపోతే భవిష్యత్తులో సురంగల్ పెద్ద చెరువులోకి వరద నీరు చేదరని రైతులు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



సురంగల్, కనకమామిడి, నజీబ్‌నగర్ రెవెన్యూ పొలిమేరలో నుంచి ఉన్న వరద కాలువను పూడ్చివేసినట్లు ఫిర్యాదు వచ్చింది. వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ సిబ్బంది వెళ్లి పరిశీలించారు. కాలువను మళ్లీ తీయించాలని ఆదేశించాం. కాలువ పూడ్చినవారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

స్వాగతం


ఫుడ్ కమిషన్ సభ్యులకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టరేట్‌కు వచ్చిన తెలంగాణ ఫుడ్ కమిషన్ బృందానికి కలెక్టర్ నారాయణరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ అధికారులతో కమిషన్ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అమలుపై సమీక్షించి, సంతృప్తి వ్యక్తంచేశారు.

సమస్యల పరిష్కారానికి రూ.7,032 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ప్రజలెదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పలు ఫ్లై ఓవర్ల నిర్మాణం, వరద నిర్వహణ, పాదచారులు సాఫీగా నడిచేందుకు రూ. 5,942 కోట్లతో హైసిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)పథకానికి రూపకల్పన చేయడంతో పాటు కేబీఆర్ పార్కు వద్ద ఆరు జంక్షన్లలో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి మరో రూ. 1,090 కోట్లు కేటాయించినట్లు 'తెలంగాణ సోషియో ఎకనామిక్–2025' నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. ఇందులో ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా రోజుకు వెయ్యి టన్నుల ఆర్డీఎఫ్‌తో జవహర్‌నగర్‌లో గత ఆగస్టు నెలలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ప్రారంభమైందని పేర్కొంది. ఇంకా.. ల్యాండ్‌ఫిల్ గ్యాస్‌తో 1.5 మెగావాట్ల గ్యాస్– ఇంజిన్ పవర్‌ప్లాంట్ పనిచేస్తోందని తెలిపింది.

రైతువేదికలో అసాంఘిక కార్యకలాపాలు

కేశంపేట: మండల కేంద్రంలోని రైతువేదిక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇందులో మంగళవారం రాత్రి ఓ యువతీయువకుడిని గమనించిన స్థానికులు ఇక్కడ ఎందుకున్నారని ప్రశ్నించారు. దీనిపై పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు వారిని వీడియో తీసి, మరోసారి ఈప్రాంతంలో కనిపించకూడదని హెచ్చరించి పంపించేశారు. విషయం తెలుసుకున్న కేశంపేట క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నిఖిల్ రెడ్డి రైతువేదిక వద్దకు చేరుకుని వివరాలు సేకరించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ అనుచిత ప్రవర్తన

- సిగరెట్ తాగొద్దని చెప్పినందుకు ప్రయాణికుడిపై దుర్భాషలు
- ట్విటర్‌లో పోస్టుతో స్పందించిన బస్ భవన్ అధికారులు

ఇబ్రహీంపట్నం: పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్‌కు ఆర్టీసీ బస్సులో చేదు అనుభవం ఎదురైంది. బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు సిగరెట్ తాగొద్దని సూచించడంతో ఆయన పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. ఈ ఘటన బుధవారం ఇబ్రహీంపట్నం వద్ద చోటు చేసుకుంది. ఎంజీబీఎస్ నుంచి మాల్యాపురం వెళ్తున్న హైదరాబాద్ డిపో– 1కు చెందిన ఆర్టీసీ బస్సులో ఇబ్రహీంపట్నం వద్ద రఘునందన్ ఎక్కారు. కొద్దిదూరం వెళ్లిన అనంతరం డ్రైవర్ సిగరెట్ తాగడాన్ని గమనించి, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. దీంతో డ్రైవర్ ఆయనను దుర్భాషలాడారు. ఈ ఉదంతాన్ని వివరిస్తూ.. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఎక్స్(ట్విటర్) ద్వారా రఘునందన్ కోరారు. దీనిపై స్పందించిన బస్ భవన్ అధికారులు.. ఆయనకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణ చెప్పడంతో పాటు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు.

కనుల పండువగా రథోత్సవం


పల్లకీ సేవలో భక్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు గోపాలాచార్యులు, రామాచార్యులు, రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భక్తుల కోలాహలం నడుమ రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, ఈఓ స్నేహలత, మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: మనస్తాపానికి గురైన వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ శివారులో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామానికి చెందిన సంద శ్రీనివాస్(32) డ్రైవర్‌గా పని చేస్తూ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలం క్రితం అతడి తల్లిదండ్రులు మృతి చెందారు. దీంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఎవరూ లేకపోవడంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలను తెలుసుకొని బంధువులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్టేషన్ మాస్టర్ అబుదేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

'ఫ్యూచర్'లో విలీనానికి ఉద్యమిస్తాం


మాట్లాడుతున్న రఘుపతి

- మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయడానికి అన్ని వర్గాల ప్రజలతో ఉద్యమిస్తామని జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని విలీనం చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మహా నగరం చేస్తామని గతంలో సీఎం ఎన్నో సార్లు చెప్పారని గుర్తు చేశారు. దీనిపై ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం రేవంత్‌రెడ్డిలను కలిసి తమ సమస్యను విన్నవిస్తామన్నారు. ఈ నెల 21న మండల పరిధిలోని అమీర్‌పేట్ పద్మావతి ఫంక్షన్ హాలులో ఫ్యూచర్ సిటీ జేఏసీ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు మనోహర్, సభ్యులు మల్లేష్ యాదవ్, అంద్యానాయక్, ఈశ్వర్‌ముదిరాజ్, సుదర్శన్‌యాదవ్, యాదయ్య, కృష్ణానాయక్, పాండునాయక్, దత్తునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలందించండి

- ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు కృషి చేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వాటిని ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ ద్వారా రుణాలు అందించాలన్నారు. యాసంగి, వానాకాలం సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, రానున్న సీజన్‌లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు సకాలంలో అందించాలని తెలిపారు. పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని తెలిపారు. క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలన్నారు. సబ్సిడీ రుణాలు పంపిణీలో జాప్యం చేయవద్దని చెప్పారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు యూనిట్ల గ్రౌండింగ్‌లో జాప్యం జరుగుతుందని చెప్పగా కలెక్టర్ స్పందించి వెంటనే పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ శ్రీదేవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కుసుమ, నాబార్డు ఏజీఎం, వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీలత, మెప్మా పీడీ మల్లీశ్వరీతో పాటు వివిధ బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను శుభ్రం చేయించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


శుభ్రం చేసిన ప్రదేశం

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని శంకర్‌పల్లి ప్రధాన రోడ్డు పక్కన డంపింగ్‌లా వేసిన చెత్తను మున్సిపల్ అధికారులు బుధవారం తొలగించారు. సాక్షిలో ప్రచురితమైన మున్సిపాలిటీలలో లోపిస్తున్న పారిశుద్ధ్యం అనే కథనానికి స్పందించారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద, శంకర్‌పల్లి ప్రధాన రోడ్డుపక్కన వేసిన చెత్త డంపింగ్‌లను పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు. ప్రజలు అందరూ కూడా మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ కోరారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని ఇళ్ల వద్దకే వచ్చే వాహనాల్లో వేయాలని సూచించారు.

సుందర మూసీకి అడుగులు..

- మూసీ పునరుజ్జీవానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్
- సామాజిక, ఆర్థిక సర్వే–2025లో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: మూసీకి పునరుజ్జీవం కల్పించి తీరాల్సిందేనని రేవంత్ సర్కారు కంకణం కట్టుకుంది. నదిని శుభ్రపరిచి, పునరుద్ధరణ చేయడంతో పాటు దాని పరిసరాలను సుందరీకరించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. జీహెచ్ఎంసీ పరిధిలో 55 కి.మీ. ప్రవహించే ఈ మూసీ నదికి పునరుజ్జీవం కల్పించాలని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) లక్ష్యంగా పెట్టుకుంది. చారిత్రక పరిసరాలు, మార్కెట్ ప్లేస్‌లను పునరుద్ధరించి..కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలను సృష్టించడం, వారసత్వం, సంస్కృతిని పరిరక్షించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, మెరుగైన ప్రయోజనాలను అందిస్తుందని ఈమేరకు సామాజిక, ఆర్థిక సర్వే–2025లో వెల్లడించారు.

110 చ.కి.మీ. వరకూ..

- నగరంలో 55 కి.మీ. నదికి (ప్రతివైపు కిలోమీటరు) వరకు ఇరువైపులా 110 చదరపు కిలోమీటర్ల వరకు అభివృద్ధి చేయనున్నారు. మూసీకి ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నారు. మూసీ పునరుజ్జీవంతో 200 చదరపు కిలోమీటర్ల వరకు వృద్ధి అవకాశాలు మెరుగవుతాయి.
- ఉస్మాన్‌సాగర్ డ్యామ్ నుంచి గౌరెల్లి వరకు, హిమాయత్‌సాగర్ డ్యామ్ నుంచి బాపూఘాట్ వరకు మూసీ నదిని సుందరీకరించనున్నారు. అలాగే మూసీ నదిపైన ఔటర్ రింగ్ రోడ్డు వరకు 17 వంతెనలను నిర్మించనున్నారు.
- ఇప్పటికే మూసీ నది గర్భం, బఫర్ జోన్లలో ఆక్రమణల తొలగింపుతో పాటు భూసేకరణ, పునరావాసం గణన పూర్తయింది.

200 ఎకరాలు పరిరక్షించిన హైడ్రా

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం గత ఏడాది ద్వితీయార్థంలో ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పనితీరును ప్రభుత్వం సామాజిక–ఆర్థిక ముఖచిత్రంలో (తెలంగాణ సోషియో ఎకనమిక్ ఔట్‌లుక్–2025) ప్రభుత్వం ప్రస్తావించింది. ఈ విభాగం ఇప్పటి వరకు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడినట్లు పేర్కొంది. వీటిలో చెరువులు, పార్కులతో పాటు ఖాళీ స్థలాలు ఉన్నట్లు వివరించింది. హైడ్రాలో అంతర్భాగంగా ఉన్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) 2024లో 4684 ఎమర్జెన్సీ ఆపరేషన్స్ చేపట్టిందని, వీటిలో ప్రమాదాలతో పాటు రెస్క్యూలు ఉన్నాయని సర్కారు తెలిపింది. ప్రస్తుతం 12 చెరువుల్లో పునరుజ్జీవం కల్పించడమే లక్ష్యంగా హైడ్రా పని చేస్తోందని, దీనిలో ఉన్న 42 డీఆర్ఎఫ్ బృందాలను 72కు పెంచనున్నట్లు పేర్కొంది.

ముగ్గురి బైండోవర్

మోమిన్‌పేట: మండల తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గురిని బైండోవర్ చేసినట్లు బుధవారం తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. గతంలో సారా కాస్తున్న లచ్చానాయక్ తండాకు చెందిన మేఘవత్ ప్రభు, మేఘవత్ బుజ్జిబాయి, మేఘవత్ ఫకీరలను బైండోవర్ చేశామన్నారు. ఎలాంటి ప్రభుత్వ నిషేధిత వస్తువుల జోలికి వెళ్లకూడదని ఆయన సూచించారు.

పద్దులో విద్యకు నిరాశే



హుడాకాంప్లెక్స్: బడ్జెట్‌లో ఈసారి విద్యకు ఆశించిన నిధులు కేటాయించలేదు. కేవలం రూ.23,108 కోట్లు(7.57శాతం) మాత్రమే పద్దులో చూపారు. గతేడాది కంటే 0.2శాతం కేటాయించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేవు. సన్న బియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తామని ప్రభుత్వం తెలియజేసింది. ఇప్పటికీ అనేక గురుకులాలు అద్దె భవనాలు నిర్వహిస్తున్నారు. బాలికలకు ప్రత్యేక వసతులు లేక వారిలో డ్రాప్ అవుట్ శాతం పెరుగుతోంది. 7.57 శాతం బడ్జెట్‌తో ఇవన్నీ సాధ్యమేనా.

– కరుణాకర్‌రెడ్డి, ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

బడ్జెట్ ఊరటనివ్వలేదు



షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులు, కార్మికులకు ఎలాంటి ఊరటనివ్వలేదు. బడ్జెట్‌లో ప్రభుత్వం కార్మిక శాఖకు నామమాత్రంగా రూ.900 కోట్ల కేటాయించింది. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, గ్రామ పంచాయతీలు, మున్సిపల్, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ తదితర శాఖలకు వేతనాల పెంపు గురించి, క్రమబద్ధీకరణపై బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కార్మికుల సంక్షేమం కోసం పెట్టిన అంశాలను పూర్తిగా విస్మరించింది.

– రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు